విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

ధాన్యం కొనుగోలులో జిల్లాను ఆదర్శంగా నిలపాలి

జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

విశాలాంధ్ర - ఏలూరు : ధాన్యం కొనుగోలులో రైతులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ప్రొక్యూర్ మెంట్ మానటరింగ్ ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ చెప్పారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని గోదావరి సమావేశ మందిరంలో ఖరీఫ్ ధాన్యం కొనుగోలుపై ప్రాథమిక వ్యవసాయ పరపతి సొసైటీల అధ్యక్షులు, కార్యదర్శులు, రైస్ మిల్లర్స్, ట్రాన్స్ పోర్ట్ అసోషియేషన్, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ ధాన్యం కొనుగోలు పకడ్బందీగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా చేయాలన్నారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి జిల్లాను ఆదర్శంగా నిలపాలన్నారు. ధాన్యం కొనుగోలు సజావుగా సాఫీగా జరిగేందుకు 2 నెలలు పాటు ప్రొక్యూర్ మెంట్ మానటరింగ్ ప్రత్యేక సెల్ ను ఏర్పాటు చేయనున్నట్టు చెప్పారు. కొన్ని మండలాలకు ప్రత్యేకాధికారులను కూడా ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు మంజు భార్గవి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ,జిల్లా సహకార శాఖ అధికారి ప్రవీణ, జెడ్పీ సీఈఓ కె.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ

విశాలాంధ్ర - పెంటపాడు : జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి పెంటపాడు మండలంలోని ఆకుతీగపాడు, దర్శిపర్రు రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేయబోయే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.బుధవారం పెంటపాడు మండలం ఆకుతీగపాడు, దర్శిపర్రు రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేయబోయే ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టరు ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతు భరోసా కేంద్రంలో రేపటినుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించేందుకు అన్ని వసతులు సక్రమంగా ఉన్నాయో లేదో కలెక్టర్ పరిశీలించారు. తేమ చూసే మిషన్, కంప్యూటర్లు, గోనెసంచులు తదితర వాటిని జిల్లా కలెక్టరు పరిశీలించి అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జి డి ఆర్ ఓ దాసి రాజు, వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ కె. శ్రీనివాసరావు , తహాశీల్దారు జి. శేషగిరి,యం డి వో డి. దామోదరరావు, ఏ ఓ కె. పార్ధసారథి , రైతు భరోసా కేంద్ర సిబ్బంది , రైతులు ,తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ డీఎస్పీగా కృష్ణారావు

విశాలాంధ్ర - ముసునూరు : గురిందగుంట కృష్ణారావు శ్రీకాకుళం జిల్లా పాలకొండ డీఎస్ పి గా నియమితులయ్యారు. ఏలూరు జిల్లా ముసునూరు మండలం వేల్పుచర్ల గ్రామానికి చెందిన కృష్ణారావు విద్యాభ్యాసం పెదవేగి మండలం కొప్పాక గ్రామంలో పదవ తరగతి వరకు కొనసాగింది. అనంతరం ఏలూరులోని సర్ సి ఆర్ ఆర్ కళాశాలలో బీకాం డిగ్రీ పూర్తి చేశారు. 1990 సంవత్సరంలో ఉస్మానియా యూనివర్సిటీ లిటరేచర్ లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. అనంతరం ఏపీ స్టడీ సర్కిల్‌లో సివిల్ సర్వీసెస్ శిక్షణ పొందారు. 1991లో ఎస్ఐ గా ఎంపిక అయ్యారు. 2020లో డి.ఎస్.పి గా పదోన్నతి పొందారు. ఇప్పటివరకు పశ్చిమగోదావరి జిల్లా ఇంటిలిజెన్స్ ఏలూరులో విధులు నిర్వహించారు. సాధారణ బదిలీలలో భాగంగా ఈనెల 8వ తేదీన శ్రీకాకుళం జిల్లా పాలకొండ డి.ఎస్.పి గా బదిలీపై వెళ్లారు.

13, 14 తేదీల్లో రైతుల, ఆక్వా రైతుల నిరసన

విశాలాంధ్ర - పాలకొల్లు : రైతు వ్యతిరేక విధానాలతో పరిపాలన సాగిస్తున్న ముఖ్య మంత్రి జగన్ పతనం తప్పదని పాలకొల్లు ఎమ్మెల్యే రామానాయుడు అన్నారు. ప్రధానంగా ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి ఇన్సూరెన్స్ ఇన్పుట్ సబ్సిడీ విషయంలో రైతులను దగా చేస్తున్నారని ఎమ్మెల్యే నిమ్మల విమర్శించారు. నేటి ప్రభుత్వ విధానంలో రైతుల ధాన్యం డబ్బులు రైతులకు ఇచ్చే పరిస్థితి లేదని, ధాన్యం అమ్ముకునే పరిస్థితి కూడా లేదన్నారు. రైతులు క్రాఫ్ హాలిడే వైపు మొగ్గు చూపిస్తున్నారన్నారు. రైతు సమస్యలపై ఈనెల 13న తూర్పుగోదావరి జిల్లా మండపేటలో ఉభయగోదావరి జిల్లాలకు సంబంధించి రైతు సమస్యలపై నినదిస్తూ భారీ రైతు నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు ఎమ్మెల్యే నిమ్మల వెల్లడించారు. ఈనెల 14న ఆక్వా సమస్యలపై ఆక్వా విద్యుత్ సబ్సిడీని జగన్ ఎత్తివేయడం, ఆక్వా సీడ్ ధరలు విపరీతంగా పెరిగిపోవడంపై, ఆక్వా రైతులు కూడా క్రాఫ్ హాలిడే తీసుకునే పరిస్థితి నెలకొందన్నారు. ఈ నేపధ్యంలో ఉండి నియోజకవర్గంలో నియోజకవర్గంలో భారీ ఆక్వా రైతు నిరసన కార్యక్రమం ఈనెల 14న నిర్వహిస్తు న్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ రెండు కార్యక్రమాల ద్వారా ప్రభుత్వానికి రైతులు ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించడంతోపాటు రైతుల సత్తా ఏమిటో తెలియజేస్తామన్నారు.

పొట్ట తిప్పలకు పొట్టేలు బండి

విశాలాంధ్ర-ఉంగుటూరు: పొట్ట గడవని పరిస్థితి లో మనిషి బ్రతుకు తెరువు కోసం భిన్న మార్గాలు అవలంబించేలా చేయడం పరిపాటి. అచ్చం అలాంటి దృశ్యమే మండల కేంద్రం ఉంగుటూరు లో బుధవారం కానవచ్చింది. ఫొటోలో కనిపిస్తున్న పెద్దాయన కృష్ణా జిల్లా వాసి. కరోనా మహమ్మారి విజృంభణ కాలంలో ఉన్న ఉపాధిని పోగొట్టుకుని బ్రతుకు తెరువు కోల్పోయి ఎలా బతుకాలని , ఆలోచించి , చివరికి తనకు మిగిలి ఉన్న రెండు పొట్టేళ్ళను అలంకరించిన గూడు లాంటి బండిని కట్టి, ఎక్కడ తిరునాళ్ళు జరిగినా హాజరై భక్తుల వితరణతో పొట్ట పోసుకుంటున్నాడు ఆ నిరుపేద. ఉంగుటూరు మీదుగా సాగుతూ గ్రామంలోకి వచ్చిన ఆ బండి పిన్నా పెద్దలను ఆకర్షించింది. గ్రామస్థులు ఆయన వివరాలు తెలుసుకుని చేతనైన సహాయం చేశారు.

ఆర్టీసీ బస్సు ఢీ : గర్భిణీ మృతి

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నిండు గర్భిణీ మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు , పోలీసులు తెలి పిన వివరాలు ప్రకారం మండలంలోని లక్ష్మీ పురంనకు చెందిన గురివింద పోసారావు అతని భార్య శివుడు పోసిలక్ష్మి (25) కెఆర్ పురం ఆసుపత్రికి వైద్య పరీక్షలు నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళుచుండగా పోలవరం నుండి జంగారెడ్డిగూడెం వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు రాజానగరం సమీపంలో వారు ప్రయాణిస్తున్న వాహనాన్ని ఢీ కొట్టడంతో పోసిలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది. అనుకోని ప్రమాదం సంభవించి 9 నెలల నిండు గర్భిణీ అక్కడికక్కడే మృతి చెందడంతో కుటుంబ సభ్యులతో సహా, స్థానికులు కన్నీరు మున్నీరయ్యారు.

ఆన్ లైన్ మార్కెటింగ్ విధానంపై లేసు మహిళలకు సెమినార్

విశాలాంధ్ర - పాలకొల్లు : వశిష్ట గోదావరి లేస్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో వన్ డే సెమినార్ యలమంచిలి మండలం పాలవెల్లి గెస్ట్ హౌస్ లో బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హస్త కళల జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి ఏ.కృష్ణారెడ్డి హాజరయ్యారు. లేసు మహిళలు నైపుణ్యాన్ని పెంచుకొని ఉత్పత్తులు చేస్తే, ఆ ఉత్పత్తులకు విలువ పెరుగుతుందని కృష్ణారెడ్డి అన్నారు. మరొక ముఖ్య అతిథి భారత కేంద్ర ప్రభుత్వ హ్యాండీక్రాఫ్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్ అపర్ణ లక్ష్మి మాట్లాడుతూ మా సంస్థ ద్వారా ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తంగా చేస్తూ హస్త కళాకారులకు అండగా నిలబడుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో డిజైన్, సాంకేతిక అభివృద్ధి కమ్యూనికేషన్ జీఎస్టి ఎక్స్పోర్ట్, మార్కెటింగ్ మొదలైన అంశాల గురించి మహిళలకు విపులంగా వివరించారు. ఆన్లైన్ మార్కెటింగ్ ఎలా సేల్ చేయాలనే విధానాన్ని లేసు అల్లే మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో హస్తకళల అభివృద్ధి అధికారి ఎం. సువర్చల, కంపెనీ ఎండి ఐ.కనకదుర్గ, రిసోర్స్ పర్సన్ సుధీర్, లేస్ ఆర్టిజన్స్ పాల్గొన్నారు.

గిరి మృతి ప్రజా నాట్య మండలి ఉద్యమాలకు తీరనిలోటు

విశాలాంధ్ర -భీమవరం: సయ్యపురెడ్డి గిరి మృతి ప్రజా నాట్య మండలి ఉద్యమాలకు తీరనిలోటని ఎ.పి.ప్రజా నాట్యమండలి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్ నివాళులర్పించి ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ప్రజానాట్యమండలి కళాకారునిగా ఆయన సమాజానికి సేవలందించారని కొనియాడారు. పశ్చిమగోదావరి జిల్లా సీపీఐ సమితి తరపున జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు సంతాపం తెలిపారు. కళాకారులు డీవిఆర్ హనుమంత రావు, ఆర్.ఆదినారాయణ, మీసారపు లాల్, తిరుమాని కామేశ్వరరావు, ఎం.లక్ష్మీపతి, ఛాన్ భాషా, నారాయణరావు తదితరులు సంతాపం తెలిపారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం

జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది, ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా కలెక్టర్ పి .ప్రశాంతి పిలుపు నిచ్చారు. బుధవారం స్థానిక బి వి రాజు కాలేజ్ ఆవరణలో ఓటుహక్కు నమోదు పై అవగాహనా ర్యాలీని ప్రారంభించారు. ఓటరు నమోదు అవగాహనా ర్యాలీ బి వి రాజు మెయిన్ గేటు వద్ద నుండి బీవీ రాజు విగ్రహం వరకు ఓటరుగా నమోదు అవ్వండి - తలరాతను మార్చండి, మార్పు కావాలంటే తప్పనిసరిగా ఓటు వేయాలి, ఓటుకు నోటు ప్రజాస్వామ్యానికి చేటు, తదితర నినాదాలతో ప్రజలను చైతన్యపరుస్తూ ర్యాలీ సాగింది. అనంతరం జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ 2023 సంవత్సరం జనవరి 1వ తేదీ నాటికి 18 సంవత్స రాలు వయస్సు పూర్తి చేసుకునే వారు ఓటరుగా నమోదు కావడానికి ముందస్తుగా దరఖాస్తు సమర్పించవచ్చని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి డి ఆర్ వో దాసి రాజు మాట్లాడుతూ ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యా శాఖ అధికారి ఆర్.వి.రమణ, మున్సిపల్ కమిషనర్ యస్. శివరామకృష్ణ, తహశీల్దార్ వై .రవికుమార్ , బివి రాజు కళాశాల ప్రిన్సిపాల్ ఐ ఆర్ కె రాజు, వైస్ ప్రిన్సిపాల్ పి. శ్రీనివాస రాజు , వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

టెర్రీ టవల్ , ఒంగోల్ టవల్ లిమిటెడ్ కంపెనీతో ఒప్పందం

విశాలాంధ్ర - తణుకు : గ్లోబల్ ఇన్వెస్ట్మెంట్ ఇన్ ఇండియా లో భాగంగా సౌత్ కొరియా లాంగ్ యాంషిన్ ప్రోవెన్స్ ఛాంబర్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ మేయర్ డాంగ్ ఇన్ నా సమక్షంలో ప్రముఖ టెర్రీ టవల్ తయారీ దారులు సొంగూల్ టవల్ లిమిటెడ్ కంపెనీ తో రవళి స్పిన్నర్లు ఉత్పత్తి ఎగుమతి కోసం ఒప్పందం చేసుకుంది . న్యూ ఢిల్లీ లోని హయత్ రీజెన్సీ కాన్ఫరెన్స్ హాలు లో జరిగిన ఈ ఒప్పంద సెర్మణిలో యసం సిటీ ఛాంబర్ సభ్యులు, సంగూల్ అధినేత బుంగ్ దే పాక్ , రవళి స్పిన్నర్లు అధినేత వంక రవీంద్ర నాథ్ , సౌత్ కొరియా పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు . భారత్ , సౌత్ కొరియా దేశాలు చాల చారిత్రక , సంస్కృతిక సాంప్రదాయ దేశాలని , ఈరెండు దేశాల మధ్య వాణిజ్య అభివృద్ధి కి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కూడా చక్కటి సహకారం అందిస్తుందని , త్వరలో విశాఖపట్నం లో జరగబోయే ఇన్వెస్ట్మెంట్ సదస్సు కు కొరియా నుండి ఇన్వెస్టర్స్ ఎక్కువగా వచ్చి ప్రభుత్వం అందించే సహకారంతో ఇరుదేశాల వాణిజ్యాన్ని అభివృద్ధి చేయాలనీ రవీంద్ర నాథ్ కోరారు. కొరియన్ మేయర్ డాంగ్ యెన్ నా , తప్పనిసరిగా ఈ విషయాల్ని తమదేశంలో పారిశ్రామికవేత్తలకు తెలియజేస్తామని , ఔత్సహికులతో విశాఖపట్నం వస్తావని హర్షధ్వానాల మధ్య తెలిపారు .

పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలి: ఏఐటీయూసీ

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీ యూసీ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . ఆయాల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించాలని కోరుతూ ఏఐటియుసి ఆధ్వర్యంలో ఆయాలు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బుధవారం ధర్నా చేశారు . ఈ ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ఆయాల కు రాష్ట్ర ప్రభుత్వం కేవలం ఆరువేల రూపాయలు వేతనం ఇస్తుందని, అవి కూడా దాదాపుగా మూడు నెలల అందడం లేదన్నారు. ఈ నేపథ్యంలో వారి కుటుంబాలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నా యన్నారు. పెండింగ్ లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలో చెల్లించని 12 నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని , 108 జీవో ప్రకారం రూ 11500 లు వేతనం ఇవ్వాలన్నారు . వేతనాలు అమ్మ ఒడి నుంచి కాకుండా ప్రత్యేకంగా సి ఎఫ్ ఎం ఎస్ అకౌంట్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యల పై సబ్ కలెక్టర్ కార్యాలయం పరిపాలనఅది కారికి వినతిపత్రం అందజేశారు . ఈ కార్యక్రమంలో ఆయాలు నీలం జ్యోతి , దేవ మాత, నస్రెహెన్, మట్ట కుమారి, దుర్గ, రేణుక, మేరీ, నిర్మల, లక్ష్మీ కుమారి, నాగమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

కారుమూడి ఆశయాలను అనుసరించాలి

విశాలాంధ్ర -చింతలపూడి రూరల్ : కారుమూడి సత్యనారాయణ రెడ్డి ని ఆదర్శంగా తీసుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానా లపై పోరాడాలని సీపీఐ సీనియర్ నాయకులు జంగా రామచంద్ర రెడ్డి పిలుపునిచ్చారు. కారుమూడి సత్యనారాయణ రెడ్డి 25వ వర్ధంతి సభ సిపిఐ మండల సహాయ కార్యదర్శి పుల్లారి సోమశేఖర్ అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రామచంద్రారెడ్డి మాట్లాడుతూ చింతలపూడి ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతల్లో సత్యనారాయణ రెడ్డి ముఖ్యులని ,తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో పాల్గొని కొరియర్ గా పనిచేస్తున్న సందర్భంలో బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను కడలూరి జైల్లో నిర్బంధించిందన్నారు. గ్రామంలో రైతుల సమస్యలపై నిరంతరం పనిచేస్తూ ధాన్యం కొనుగోలు విషయంలో జరుగుతున్న అన్యాయానికి వ్యతిరేకంగా చేసిన పోరాటాల ఫలితంగా 78 కేజీల తూకం నుండి 75 కేజీలుగా మార్చారని గుర్తు చేసుకున్నారు. తొలుత సత్యనారాయణ రెడ్డి విగ్రహం వద్ద సిపిఐ జెండాను శ్రీరామ ఆచార్యులు ఆవిష్కరించగా, మృతవీరుల స్థూపం వద్ద జెండాను తలారి గంగరాజు, ఏఐటీయుసి జెండాను జంగా రామచంద్రారెడ్డి లు ఆవిష్కరించి, విగ్రహానికి సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తుర్లపాటి బాబు, పూలమాలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో దొంతా కృష్ణ, కారుమూడి రమేష్, వనం కృష్ణ, వెంకటేశ్వరరావు, ఉప్పుయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

14న ఆక్వా రైతుల నిరసన జయప్రదం చేయండి

విశాలాంధ్ర - ఉండి : ఈనెల 14వ తేదీన ఉండి కోట్ల ఫంక్షన్ హాల్ లో నిర్వహించు ఆక్వా రైతుల నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు రైతులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం నిమ్మల రామానాయుడు మంతెన రామరాజు కోట్ల ఫంక్షన్ హాలును పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ 13న మండపేటలో ధాన్యం,14న ఉండిలో ఆక్వా రైతుల నిరసన సభ జరుగుతుందన్నారు. ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న నాణ్యత లేని సీడ్, ఫీడ్, గిట్టుబాటు ధరలు, విద్యుత్ సబ్సిడీ కోతలకు నిరసనగా ఉండిలో నిరసన తెలుపుతున్నట్లు ప్రకటించారు. టీడీపి మండల అధ్యక్షులు జుత్తిగ శ్రీనివాసరావు, పొత్తూరి వెంకటేశ్వరరాజు, కట్ట రాంబాబు, గురుగు బిల్లి వెంకట సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అధికారులను నిలదీసిన రైతులు

విశాలాంధ్ర-ఉంగుటూరు : ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం వచ్చిన పౌరసరఫరాల ఎండీ వీరపాండియన్ ఎదుట ధాన్యం కొనుగోలు విషయంలో తమ సమస్యలను పరిష్కరించాలంటూ రైతులు ఏకరువు పెట్టారు. బుధవారం ఉంగుటూరు రైతు భరోసా కేంద్రాల్లో జరిగిన రైతుల సమావేశంలో అధికారులను రైతులు, కౌలు రైతులు నిలదీశారు. అధికార పార్టీకి చెందిన వారే అధికారుల్ని ప్రశ్నించడంతో అక్కడ ఉన్న అధికార పార్టీ ప్రతినిధులు కంగుతున్నారు. పాత పద్ధతి లోనే ధాన్యం కొనుగోలు చెయ్యాలని రైతులు కోరారు. నారాయణపురం లో కోతలు కోసి 15 రోజులు అయ్యిందని, రోడ్లమీద ఆరబెట్టుకుంటున్నామని నారాయణపురంలో రైతులు వాపోయారు. తేమ శాతం 17 కన్నా తక్కువగా ఉన్న ధాన్యం కొనుగోలు చేయట్లేదని ఆర్బీకే సిబ్బంది కొలిచిన తేమశాతం ఫలితాలను ఎండీకి చూపించారు. దీనిపై వ్యవసాయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే కొనుగోలు చేయాలని ఆదేశించారు. రెండు పంటలకు సంబంధించి హమాలీ చార్జీలు కూడా ఇవ్వలేదని రైతులు వీరపాండియన్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై అధికారులను ఆరా తీశారు. రాష్ట్రానికి రూ. 50 కోట్లు మంజూరు కాగా జిల్లాకు రూ.10 కోట్లు వచ్చాయని త్వరలోనే చెల్లిస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం ఉంగుటూరు రైతు భరోసా కేంద్రం-1 లో రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం చెప్పిన విధానాలు క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని దీంతో దాన్ని అమ్ముకోవడానికి తీవ్ర ఇబ్బంది పడుతున్నామని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గోనె సంచుల కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలని జేసీ అరుణ్ బాబు, సివిల్ సప్లై డీఎం మంజు భార్గవిలకు ఎండీ వీరపాండియన్ సూచించారు. తొలుత చేబ్రోలు రైతు భరోసా కేంద్రం-1 పరిశీలించారు. అక్కడ సిబ్బందికి పరికరాల పని తీరుపై అవగాహన లేకపోవడంతో యుద్ధ ప్రాతిపదికన శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని జేసి అరుణ్ బాబుకు సూచించారు.

ప్రజలను చైతన్యవంతులను చేయాలి

విశాలాంధ్ర -భీమవరం: కళాకారులు ప్రజలను చైతన్య వంతు లను చేసే కళారూపాలు ప్రదర్శిస్తూ అభ్యుదయ గేయాలు పాడుతూ ప్రజల్ని మేల్కొలపాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రజానాట్యమండలి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాం ప్రసాద్ అన్నారు బుధవారం భీమవరం రూరల్ తాడేరు హైస్కూల్లో జరిగిన బాలల దినోత్సవం వారోత్సవాలను పురస్క రించుకొని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పశ్చిమగోదావరి జిల్లా ఆధ్వర్యంలో పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీల్లో పాల్గొన్న బాల బాలికలు భవిష్యత్తులో మంచి గాయకు లుగా గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపా ధ్యాయులు ఆర్.సింహాద్రిరావు, ప్రజా కళాకారులు చాన్ భాషా, ఉపాధ్యా యులు జి. విజయ్ కుమార్, ముత్యాల కుమారి, మంగారావు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను అవగాహన చేసుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం: న్యాయ దినోత్సవం స్ఫూర్తితో ప్రజలు చట్టాలపై అవగాహన చేసుకుని న్యాయం పొందాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగా రావు పిలుపునిచ్చారు. విస్సాకోడేరులో డీఎన్నార్ న్యాయ కళాశాల విద్యార్థులు బుధవారం న్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టం అందరికీ సమానమేనని అందరికీ హక్కులున్నాయి న్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బళ్ల శ్రీనివాస్, దుండి ఏసు, పెన్మత్స శ్రీనివాసరాజు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యునిగా డేగా ఎన్నిక పట్ల హర్షం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : సీపీఐ నాయకులు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మాజీ కార్యదర్శి, డేగా ప్రభాకర్ కు రాష్ట్ర కార్యదర్శి వర్గంలో సభ్యునిగా స్థానం కల్పించినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సీపీఐ కొయ్యలగూడెం మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డేగా ప్రభాకర్ కొయ్యలగూడెంలో జన్మించి విద్యను అభ్యసించి ఉన్నత విద్య కోసం జంగారెడ్డిగూడెం వెళ్లి అక్కడ చదువుకుంటూ విద్యార్థి సంఘ నాయకుడిగా, జంగారెడ్డిగూడెం పట్టణ కార్యదర్శిగా, మండల కార్యదర్శిగా, జిల్లా కార్య దర్శిగా 3సార్లు పనిచేశారన్నారు. ఉమ్మడి జిల్లాల్లో వివిధ గ్రామాలలో అనేక చోట్ల భూ పోరాటాలు నిర్వహించి, నిరుపేదలకు ఇళ్లు,ఇళ్ల స్థలాలు, సాగు భూములు ఇప్పించడంలో ప్రధానమైన పాత్ర పోషించారన్నారు. మండల సహాయక కార్యదర్శి తాడిగడప ఆంజనేయరాజు, పట్టణ కార్యదర్శి ఎస్కే బాజీ, ఇళ్ల నర్సయ్య, తదితరులు హర్షం వెలిబుచ్చారు.

రాక్షసపాలన విముక్తికి పోరాడిన కారుమూడి

విశాలాంధ్ర - కామవరపుకోట : బ్రిటీష్ సామ్రాజ్యవాదుల రాక్షస పాలనలో బానిస బంధం విముక్తి కోసం నాడు కొనసాగిన స్వాతంత్ర్య ఉద్యమం ప్రభావంతో ఆకర్షితులైన సీపీఐ దివంగత నేత, రైతాంగ ఉద్యమ భీష్ముడు కారుమూడి సత్యనారాయణ రెడ్డి 26వ వర్ధంతి బుధవారం కామవరపుకోట శివారు కొత్తూరు ముఠా వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కారుమూడి సత్యనారాయణ రెడ్డి చిత్రపటానికి సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు పూలమాలవేసి నివాళులర్పించారు. ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కోడిగంటి సోమరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజు మాట్లాడుతూ సత్యనారాయణ రెడ్డి స్వతంత్ర ఉద్య మంలో పాల్గొని అనంతరం కమ్యూనిస్టు ఉద్యమంలో ప్రధాన భూమిక పోషించి పార్టీపై నిషేధం ఉన్న కాలంలో పలు వేషాల్లో కొరియర్‌గా సేవలందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నల్లమోతుల కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

బుంగా లత భర్త బుంగా లాజరు చిననింద్ర కొలను గ్రామం నిడమర్రు మండలం పశ్చిమ గోదావరి జిల్లా అను నేను నా యొక్క పాస్ పోర్టు నెం:**L9997615.** **ది.08-07-2014** తేదీన విశాఖపట్నం వారిచే జారీ చేయబడింది నేను నా భర్త **ది.10-10-2022** తేదీన పాస్‌పోర్టును బ్యాగులో పెట్టుకుని జిరాక్స్ కోసం గణపవరం వెళ్తుండగా మార్గమధ్యలో పడిపోయినది. ఎవరికైనా దొరికినట్లయితే నా అడ్రస్‌కు అందజేయగలరు.

బుంగా లత, భర్త బుంగా లాజరు
చిననింద్రకొలను గ్రామం నిడమర్రు మండలం
పశ్చిమగోదావరి జిల్లా
సెల్ నెం: 7207371677

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా, ద్వారకాతిరుమల మండలం, దేవినేని వారి గూడెం (రామన్నగూడెం పంచాయితీ)కు చెందిన **ముళ్ళపూడి సాయిప్రసాద్ తండ్రి కృష్ణమూర్తి** తెలియజేయునది. నా తండ్రి గారైన **ముళ్ళపూడి కృష్ణమూర్తి** గారి పేరున ఉన్న రిజిస్టర్డ్ దస్తావేజులైన **డాక్యుమెంట్ నెం.1883/1956 ది.06.06.1956 మరియు వీలునామా డాక్యుమెంట్ నెం.98/2014 ది.23.06.2014** తో పాటు అన్‌రిజిస్టర్డ్ క్రయ అగ్రిమెంట్ **ది.05.09.1980**లు ద్వారకా తిరుమల లోని కెనరా బ్యాంక్‌కు లోను పనిమీద నా స్వగ్రామం నుండి ద్విచక్రవాహనంపై వస్తుండగా **ది.26.10.2022**న మార్గమధ్యంలో కనిపించకుండాపోయినవి. సదరు దస్తావేజులు ఉన్న కవరు ఎవరికైనా దొరికిన ఎడల ఈక్రింది నెంబరుకు ఫోన్‌చేసి ఇవ్వగలరని కోరి ప్రార్థిస్తున్నాను. నా సెల్ నెంబర్:**9959292557**

విద్యాశాఖ లక్ష్యాలను సాధించాలి

జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి

విశాలాంధ్ర - భీమవరం : విద్యాశాఖలో జరిగే అన్ని కార్యక్రమాలు పూర్తిస్థాయిలో తెలుసుకొని కార్యక్రమాలు సక్రమంగా జరిగేలా పేరెంట్స్ కమిటీలను మోటివేట్ చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి అన్నారు. బుధవారం బివి రాజు కళాశాల ఆడిటోరియంలో ఎంఈఓ లు, డిఆర్‌డిఏ, ఏ పీఎంలకు విద్యాశాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం ను కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ విద్యా శాఖలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించే విధంగా ఏపీ ఎంలు పనిచేయాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో జరిగే పనులు విద్యార్థుల చదువుకు దోహద పడేలా ఉండాలని కలెక్టర్ అన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో భీమ వరం ఆర్డీవో, ఇన్‌చార్జి డీఆర్ఓ దాసి రాజు, డీఈవో ఆర్. వెంకటరమణ, సమగ్ర శిక్ష ఏపీసీ శ్యాంసుందర్, ఎంఈవోలు, ఏపిఎంలు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

విశాలాంధ్ర - ఏలూరు : అందరికి న్యాయం అందితేనే సమానత్వం సాకారమవు తుందని మొదటి అదనపు జిల్లా జడ్జి యన్. శ్రీనివాసరావు అన్నారు. బుధవారం నేషనల్ లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా ఏలూరు కోర్టు ప్రాంగణంలో ఉన్న న్యాయసేవా సదన్ భవనంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ దినోత్సవం ప్రారంభ న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి యన్. శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రత్యేకమైన వివాదాలు పరిష్కరిస్తే నేరాలు తగ్గుతాయన్నారు. పేదలకు ఉచితంగా న్యాయం అందించ డమే జాతీయ న్యాయసేవా సంస్థ ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. ఈనెల 12వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తు న్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో 7వ అదనపు జిల్లా జడ్జి పి. మంగకుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి. రాజేశ్వరితో పాటు ఏలూరులోని ఇతర న్యాయమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

చెరువుల ఆక్రమణల తొలగింపు

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : మండలంలోని అన్ని రెవెన్యూ గ్రామాల పరిధిలోని పంచాయతీ, ఇరిగేషన్ శాఖల ఆధీనంలో ఉన్నటువంటి చెరువుల ఆక్రమణలు గుర్తించి ఆక్రమణలను తొలగించే కార్యక్రమాన్ని ప్రారభించాలని సిబ్బందిని ఆదేశించినట్లు తహశీల్దార్ జి.ఎలీషా తెలిపారు. కోర్టు ఉత్తర్వుల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం రెవెన్యూ రికార్డుల ప్రకారం గ్రామాలలో ఉన్న చెరువుల విస్తీర్ణం మేరకు ఆక్రమణలను గుర్తించి వాటికి సంబంధించిన పూర్తి వివరాలను సమర్పించవలసిందిగా వి.ఆర్.ఓ లను ఆదేశించామని ఆయన తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట

విశాలాంధ్ర - గణపవరం : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేసిందని అడుగడుగునా సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పాలన సాగిస్తుందని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాస రావు (వాసుబాబు) అన్నారు. బుధవారం గణపవరం మండలం కేశవరం గ్రామంలో రూ 40 లక్షలు అంచనా వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలన గ్రామ ప్రజలందరికీ అందుబాటులో ఉండాలనే లక్ష్యంతోనే వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆలోచించి సచివాలయం అనేవి హైదరాబాదు మరియు అమరావతిలకే పరిమితం కాకూడదన్న ఉద్దేశంతోనే గ్రామ ప్రజల అవసరాలను సచివాలయాల ద్వారా గుర్తించి పరిష్కరించాలనే ఉద్దేశంతోనే రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థకు ప్రవేశపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మిగతాని కామేశ్వరి, ఎంపీపీ దండు వెంకటరామరాజు, మాజీ మంత్రి చెరుకువాడ రంగరాజు తనయుడు చెరుకువాడ నరేష్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన ర్యాలీ

విశాలాంధ్ర - ఆగిరిపల్లి: ఓటరు నమో దుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆగిరిపల్లి తహశీల్దార్ కార్యాలయం నుండి పాఠశాల విద్యార్థులతో ఆగిరిపల్లి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఎం.ఉదయ భాస్కర్ రావు, ఎంపీడీవో, సుహాసిని, వ్యవసాయ అధికారి పల్లగాని చెన్నారావు, ఆర్ఐ లక్ష్మి ఆగిరిపల్లి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో పి. అంకంపాలెం గ్రామం

- చెత్త నుండి సంపద సృష్టి

విశాలాంధ్ర - జీలుగుమిల్లి : పర్యావరణ పరిరక్షణలో పి అంకంపాలెం గ్రామం ఉందనడంలో అతిశయోక్తి లేదు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామపంచాయతీకి ఆదాయ వనరులు సమకూర్చడంలో పంచాయతీ సిబ్బంది వృత్తి ధర్మం పాటిస్తున్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామపంచాయతీలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసి గ్రామంలోని చెత్తను తీసుకువచ్చి తడి, పొడి చెత్తను వేరు చేసి వాటి నుండి వివిధ రకాలుగా సంపదను పొందేలా చేయడమే ఎస్‌డబ్ల్యుపిసి షెడ్ల నిర్మాణ ఉద్దేశం. ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకొని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని మినీ పార్కు లాగా నిర్వహించడం విశేషం. ఒకప్పుడు ఆ రహదారి వెంబడి వెళ్లాలంటే ముళ్ళ కంపలతో ఉండే నిర్మానుష్య ప్రాంతం నుండి చెత్త నుండి సంపద తయారీ కేంద్రం ఏర్పాటు తర్వాత అరా ఎకరం విస్తీర్ణంలో మినీ పార్క్ ప్రస్తుతం దర్శనం ఇస్తుంది. గ్రామపంచాయతీ కార్యదర్శి దేవ ప్రియుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామస్తులు, దాతల సహకారంతో ఉన్నతాధికారుల సూచనల మేరకు ప్రభుత్వం కేటాయించిన తక్కువ విస్తీర్ణంలోనే పర్యావరణ పరిరక్షణలో తన వంతు కర్తవ్యం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విశాలాంధ్రతో ఆయన మాట్లాడుతూ గతంలో రూ.1 లక్ష 40 వేలతో అర ఎకరం విస్తీర్ణంలో షెడ్డును ప్రభుత్వం నిర్మించిందన్నారు. సంపద తయారీతో పాటుగా ఏదైనా చేయాలని ఆలోచనతో పరిసరాలలో వివిధ రకాల పూల, పండ్ల మొక్కలతోపాటు ఔషధ విలువలు గల మొక్కలను దాతలు సహకారం, స్వీయ ఆర్థిక వనరులతో వివిధ ప్రాంతాలలోని నర్సరీల నుండి తీసుకువచ్చి వాటిని సంరక్షిస్తున్నట్లు తెలిపారు.

ఎయిడ్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కలిదిండి : ఎయిడ్స్ , క్షయ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని చైల్డ్ ఫండ్ ఇండియా ప్రతినిధి కే. రాజు ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని పెదలంక గ్రామ సచివాలయంలో చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ స్కీమ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ నియంత్రణ సంస్థ , డి ఏ పి యు సి (డ్యాప్) వారి సహకారంతో ఎయిడ్స్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్, క్షయ వ్యాప్తిపై అవగాహన ఉంటేనే ఆ వ్యాధుల బారిన పడకుండా సురక్షితంగా జీవించగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మూలలంక పీహెచ్సీ సూపర్వైజర్ డి. ధనలక్ష్మి, పంచాయతి సెక్రటరీ పి. నాగబాబు వీఆర్వో బి. సుబ్రహ్మణ్యం ఏఎన్ఎం రూన్సీ, ఆశ వర్కర్స్, వాలంటీర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర - నూజివీడు టౌన్ : నూజివీడు పట్టణంలో కొన్ని ప్రాంతాల్లో గురువారం నాలుగు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ డి కృష్ణ నాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. నూతన విద్యుత్ లైన్స్ నిర్మాణం దృష్ట్యా పట్టణంలోని అజరయ్యపేట, టౌన్ చర్చి రోడ్డు, శైలజ హాస్పిటల్ ప్రాంతం లో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన తెలిపారు . విద్యుత్ వినియోదారులు సహకరించాలని కోరారు.

14 నుంచి అఖిల భారత సహకార వారోత్సవాలు

విశాలాంధ్ర - భీమవరం : ఈనెల 14వ తేదీ నుండి 20 వరకు అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సహకార అధికారి ఎం.రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సహకార శాఖ ఆధ్వర్యంలో 69వ అఖిల భారత సహకార వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. వారోత్సవాలను పురస్కరించుకొని ప్రతి సహకార సంఘం కార్యాలయం ఆవరణలో సహకార జెండాను ఎగరవేసి సంఘ అధ్యక్షులు, పాలకవర్గ సభ్యులు, సహకారవేత్తలు, రైతులు, మహిళలు, సంఘ సభ్యులతో రోజువారి కార్యక్రమాలకు అనుగుణంగా సమావేశపరిచి పండుగ వాతావరణంలో సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. సహకార సిబ్బంది అందరూ కార్యక్రమాల్లో పాల్గొని వారోత్సవాలను విజయవంతం చేయవలసిందిగా కోరారు.

అధిక కట్నం కోసం వేధించిన ముగ్గురికి జైలు శిక్ష

విశాలాంధ్ర-టి.నరసాపురం : అధిక కట్నం కోసం వేధించిన ముగ్గురు వ్యక్తులకు జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ కె. సతీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అప్పలరాజు గూడెం గ్రామానికి చెందిన గొబ్బిళ్ళ అపర్ణను భర్త సత్య రమేష్, అత్త సుబ్బలక్ష్మి, మరిది అజయ్ లు అధిక కట్నం కోసం వేధిస్తున్నారనే సంఘటన పై 2016 వ సంవత్సరంలో టి నరసాపురం పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేసిందని తెలిపారు. చింతలపూడి కోర్టు న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్ సాక్షులను విచారించి నేరం రుజువైనందున ముగ్గురు ముద్దాయిలకు ఒక్కొక్కరికి సంవత్సరం జైలు శిక్ష, వెయ్యి రూపాయలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్ కు ఎపిపి సమ్మయ్య,టి నరసాపురం ఎస్ఐ కె.సతీష్ కుమార్, కోర్టు కానిస్టేబుల్ రాజు నిందితులకు శిక్ష పడడంలో సహకరించారు.

అల్లంచర్ల భూములను పరిరక్షించాలి

విశాలాంధ్ర-టి.నరసాపురం : మండలంలోని అల్లంచర్లరాజుపాలెం పంచాయతీలోని సర్వే నెంబరు 226లో గల భూములను పరిరక్షించాలని కోరుతూ మాజీ ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మంగళగిరి లోని టిడిపి ప్రధాన కార్యాలయం లో జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చంనాయుడును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ పరిస్థితులు, సభ్యత్వ నమోదు వంటి విషయాలను చర్చించినట్లు వారు తెలిపారు.సర్వే నెంబరు 226 భూములు అన్యాక్రాంతం కాకుండా పేదలకు దక్కేలా పోరాటం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట లక్ష్మీ నారాయణ, వాసిరెడ్డి మోహన్ రావు, జోనుబోయిన సోంబాబు, సందేపూడి సాయి, గండబోయిన శ్రీను, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా రంజక పాలన

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం : నిత్యం ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తూ ముఖ్యమంత్రి జగన్ ప్రజా రంజక పాలన చేస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే వీ ఆర్.ఎలీజా అన్నారు. బుధవారం పట్టణంలోని 12వ వార్డు రామచంద్రపురం కే.పి.రెడ్డి టవర్స్ నుండి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని,ఇంటింటికీ వెళ్ళి సంక్షేమ పథకాల అమలు తీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఉన్న ప్రధాన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి పనిచేస్తున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో పోలవరం నియోజకవర్గ కన్వీనర్ ,రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శి మండవల్లి సొంబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన లక్ష్మి,కమీషనర్ పి.భవానీ ప్రసాద్,పట్టణ వైసీపీ అధ్యక్షుడు పి.పి.ఎన్.చంద్రరావు,వైస్ చైర్మన్ లు ముప్పిడి అంజి,కంచర్ల వాసవీరత్నం,12వ వార్డు కౌన్సిలర్ షేక్ రహీమా, కౌన్సిలర్ లు తాతకుంట్ల వెంకట లక్ష్మి, నేకూరి కిషోర్, ఉగ్గం దుర్గా ప్రసాద్,ఎల్.వి.ఆర్.,చిటికెల అచ్యుత రామయ్య, మానవతా మూర్తి,దిర్సిపాము ధనలక్ష్మి, కో ఆప్షన్ సభ్యుడు వెంపా ఐజాక్, మున్సిపల్, సచివాలయ సిబ్బంది,వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

విశాలాంధ్ర -భీమవరం : గెలుపోటములు సమానంగా స్వీకరించి క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరుతేవాలని బ్రౌనింగ్ విద్యా సంస్థల చైర్మన్ మేడిది జాన్సన్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం బ్రౌనింగ్ జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో అండర్-19 విభాగంలో రాష్ట్ర స్థాయిలో పాల్గొనే జట్లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆరోగ్య భారత్ ను నిర్మించాలన్నారు. అనంతరం నిర్వహించిన నెట్ బాల్ ,రోప్ స్కిప్పింగ్ , షూటింగ్, ఆర్చరీ, ఫెన్సింగ్, జిమ్నాస్టిక్స్, మాల్కంబ్ క్రీడల్లో 73 మంది క్రీడాకారులు జిల్లా జట్లకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో కళాశాల సెక్రెటరీ కరస్పాండెంట్ మేడిది ప్రియాంక జాన్సన్, వైస్ ప్రెసిడెంట్ అబ్రహం, ప్రిన్సిపాల్ రంప ఎలిషా, ఉభయగోదావరి జిల్లాల స్కూల్ గేమ్స్ అండర్-19 కార్యదర్శులు కె.జయరాజ్, కుమార్, జిల్లా పిడి అసోసియేషన్ ప్రెసిడెంట్ మాణిక్యం రాజా, రాష్ట్ర నెట్ బాల్ సంఘ వైస్ ప్రెసిడెంట్ ఎన్.విజయలక్ష్మి, రాష్ట్ర ఫెన్సింగ్ సెక్రెటరీ కృష్ణమోహన్, ఆర్చరీ షూటింగ్ కోచ్ సుభాన్, పీడీలు నాగమణి, సాయి దావుద్, రాష్ట్ర రోప్ స్కిప్పింగ్ సెక్రెటరీ జి.సి.శేఖర్ రాజు , డిఎన్ఆర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డి.వర్గీస్ డేనియల్, పలు పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఏ టి ఏ ఆవిర్భావ దినోత్సవం

విశాలాంధ్ర - వేలేరుపాడు : ఆదివాసి టీచర్స్ అసోసియేషన్ 11వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏ టి ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి సరియం నాగేశ్వరరావు వసంతవాడ యుపిఎస్ పాఠశాలలో ముందుగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాలలో 100 శాతం నియామకాలు, పదోన్నతులు సాధించడంలో ఏటిఏ ప్రధానపాత్ర పోషించిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారము కొరకే కాకుండా గిరిజన ప్రాంతాల్లో సమస్యలపై కూడా ఏటిఏ పని చేస్తుందన్నారు. బెంతు, ఒరియా, వాల్మీకి కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చడం వలన నిజమైన ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు తమ నిర్ణయంపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఇర్పా సూర్యచందర్, పూనెం సుందర్, కుంజా రాముడు, పాయం రమేష్, పొట్ట నవీన్, రాజు, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

కేరళ తరహాలో రాష్ట్రంలో సూపర్ మార్కెట్లు

విశాలాంధ్ర- తణుకు : కేరళ రాష్ట్రం తరహాలో రాష్ట్రంలో కూడా సూపర్ మార్కెట్లను ఏర్పాటు చేయనున్నట్లు పౌరసరఫరాల వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. బుధవారం తణుకులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గ కేంద్రంతో పాటు మున్సిపాలిటీలో-1, మండలంలో-1 సూపర్ మార్కెట్లను త్వరలోనే ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ మార్కెట్ల ద్వారా ప్రజలకు తక్కువ ధరలకే సరుకులు విక్రయించడం జరుగుతుందన్నారు.తెల్ల రేషన్ కార్డు కలిగిన వారికి కూడా సబ్సిడీతో సరుకులను విక్రయిస్తామని తెలిపారు .
గతంలో మన రాష్ట్రంలో జయ బొండాలు రకం ధాన్యాన్ని ఇక్కడ రైతులు పండించే వారిని గుర్తు చేశారు. అయితే భారత ఆహార సంస్థ బియ్యన్ని కొనుగోలు చేయడం నిలిపివేయడంతో ఈ తరహా ధాన్యాన్ని మన రాష్ట్రంలో రైతులు పండించడం లేదన్నారు .కానీ ఈ రాష్ట్రంలో పండించిన ఈ రకం బియ్యం మంచి రుచి ఉండడంతో కేరళ వంటి కొన్ని రాష్ట్రాలు వీటిని కొనుగోలు చేయడం జరిగేదన్నారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం జయబండాల రకం బియ్యాన్ని కావాలని కోరడం జరిగిందన్నారు. ఇందుకోసం 50 శాతం అడ్వాన్స్ రూపంలో కూడా చెల్లిస్తామని అందుకు ఒప్పందానికి కేరళ రాష్ట్రం ముందుకొచ్చిందన్నారు. 60 వేల మెట్రిక్ టన్నులు కావాలని కోరడం జరిగిందని వివరించారు. ముఖ్యమంత్రి జగన్ సమక్షంలో త్వరలోనే ఈ ఒప్పందంపై సంతకాలు చేస్తామని వెల్లడించారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి

విశాలాంధ్ర - తణుకు : పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తణుకు నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీకారం చుట్టారు. తణుకు మండలం, దువ్వ గ్రామం, మెయిన్ రోడ్డు వాటర్ ట్యాంక్ వద్ద రూ. 38.59 కోట్లతో జలజీవన్ మిషన్ పైప్ లైన్, వాటర్ ట్యాంక్ మంచి నీటి అభివృద్ధి పనుల శంకుస్థాపన, దువ్వ గ్రామంలో డాక్టరు వైస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ ను, నూతన భవనం నందు రైతు భరోసా కేంద్రం, రైతు ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం మంత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కారుమూరి మాట్లాడుతూ నియోజక వర్గంలో ప్రతి గ్రామానికి ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన త్రాగు నీరు అందించుటకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. దువ్వ గ్రామానికి పైపు లైనుకు రూ.2 కోట్ల 15 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. దళారులు నుండి రైతులు మోసపోకుండా ధ్యానం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి మాట్లాడుతూ రైతులకు, ప్రజలకు అన్ని సేవలు ముగింట్లో అందించటమే ప్రథమ కర్తవ్యం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై డియం టి. శివరామ ప్రసాద్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టరు డి. మహేశ్వర రావు, వివిధ శాఖలు అధికారులు,గ్రామాల సర్పంచ్ లు , ప్రజా ప్రతినిధులు, రైతులు,మహిళలు, తది తరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు

విశాలాంధ్ర- ఏలూరు : ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలతో గమ్యస్థానాలకు చేర్చుతున్నామని ప్రజా రవాణా శాఖ విజయవాడ జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక ఏలూరు డిపో ను సందర్శించారు. అనంతరం జరిగిన జరిగిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లా వ్యాప్తంగా 80 వేల మంది ప్రయాణికుల్ని క్షేమంగా గమ్యం చేస్తున్నామన్నారు.2022- 23 సంవత్సరానికి 21,220 ఉచిత బస్సులు విద్యార్థిని, విద్యార్థులకు జారీ చేశామన్నారు.ఏలూరు జిల్లా నుండి శబరిమల కి 6 బస్సులు బుక్ చేశామన్నారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులకి పంచారామ క్షేత్రానికి 21 బస్సులను నడపడం జరిగిందన్నారు.ఇంకా రెండు వారాలు ఎంతో మంది భక్తులు దర్శనాలకి ఆర్టీసీ బస్సులను ఆదరిస్తున్నారు తెలియజేశారు .విద్యార్థుల సౌకర్యార్థం నూజివీడు నుండి రమణక్కపేట మీదుగా ధర్మాజీ గూడెం వరకు బస్సుని పునరుద్ధరణ చేయటం జరిగిందని, ప్రయాణికుల కోరి మేరకుఅశ్వరావుపేట నుండి జంగారెడ్డిగూడెం మీదుగా పోలవరం బస్సు ప్రారంభించామన్నారు. విద్యార్థుల, మహిళా ఉద్యోగుల సౌకర్యార్థం ఏలూరు పాత బస్ స్టేషన్ నుండి వట్లూరు వరకు బస్సు ప్రారంభించారని తెలియజేశారు. జిల్లాకి 13 కొత్త హైర్ బస్సులను కేటాయించడం జరిగిందని ఆరు బస్సులు ఇప్పటికే నడుస్తున్నాయని మిగిలినవి ఒక వారం రోజుల్లో వస్తాయని తెలియజేశారు. ఔత్సాహిక వ్యాపారులకు ఏలూరు బస్టాండ్ నందు ఉన్న ఖాళీ స్థలం బిఓటి పద్ధతి పై ఇవ్వడం జరుగుతుందని ఆసక్తి కలవారు టెండర్ లో పాల్గొనవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో డి.పి.టి.వో ఏ వీరయ్య చౌదరి,ఏలూరు డిపో మేనేజర్ బి. వాణి,ఏ .టీ .ఎం కార్గో గిరిధర్ కుమార్,ఏవో వెంకటేశ్వరరావు,ఆర్ఎం ఆఫీస్ సూపరిండెంట్ ఎం. వేణుగోపాలరావు, పీ.ఆర్వో నరసింహం పాల్గొన్నారు .

అమరవీరులకు నివాళులు

విశాలాంధ్ర - వేలేరుపాడు : ప్రజా సమస్యల పోరాటంలో అమరులైన ఎందరో వీరులకు సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా ఆధ్వర్యంలో బుధవారం వేలేరుపాడులో స్మారక సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా డివిజన్ నాయకులు సిరికొండ రామారావు, కట్ట ముత్యాలరావు అధ్యక్షత ఏర్పాటుచేసిన సమావేశంలో జంగారెడ్డిగూడెం డివిజన్ కమిటీ కన్వీనర్ ఎస్కే గౌస్ మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజా సమస్యలపై పోరాడి ఎందరో ఆనాడు అమరులైనారన్నారు. ప్రజాతంత్ర విప్లవంతో సోషలిస్ట్ వ్యవస్థను ఏర్పాటు కొరకు పోరాడిన అమరవీరుల ఆశయాలు నెరవేర్చాలన్నారు. మండలంలో అమరులైన తుర్ర ముత్యాలు, వడ్డీ రామారావు, కుంజ సుబ్బయ్య, కుంజ జోగయ్య, సోడే అర్జున్, సోడే ప్రసాదు, కట్టం దేశయ్య, సుబ్బయ్య, రవన్న, దొరన్న, ధర్మన్న, ఎల్లన్న, లింగన్న స్మరిస్తూ మౌనం పాటించి జోహార్లు అర్పించారు. ఎంతోమంది పోరాటాలు చేస్తేనే నేడు స్వేచ్ఛగా జీవించే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుత సమస్యలపై కూడా ఐక్యంగా పోరాల్సిన అవశ్యకత ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గడ్డలు ముత్యాలరావు, పురేం. లక్ష్మయ్య, డివిజన్, మండల నాయకులు కట్టం వీరస్వామి, మేడేపల్లి,నార్లవరం సర్పంచులు కట్ట రాంబాబు, మడివి రంగమ్మ, ఉప సర్పంచులు బుచ్చయ్య, మోసం రాజారావు, ఎంపిటిసి రత్తమ్మ, కుంజా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర- దేవరపల్లి : దేవరపల్లి మండలం ఎర్నగూడెం జిల్లా పరిషత్ హై స్కూల్ లో సివి రామన్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బుధవారం సామాజిక విశ్లేషకులు సుంకవల్లి సత్తిరాజు బహుమతులు జ్ఞాపకలను అందజేశారు. మొదటి బహుమతి ఎం. కీర్తివర్షిని, రెండవ బహుమతి జి. రిషిత, పి. సింగ కావ్య, మూడవ బహుమతి టి. ధరణి, డి. ప్రియమణి ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను ప్రధాన ఉపాధ్యాయుని వాసవి, ఉపాధ్యాయులు జగదీష్ రాజు తదితరులు అభినందించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

విశాలాంధ్ర - దేవరపల్లి : దేవరపల్లి విశ్రాంతి ఉద్యోగుల సంఘం భవనం వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని రాజమహేంద్రవరం అఖిల కంటి ఆస్పత్రి చెందిన వైద్యులు రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.విశ్రాంతి ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఉచిత కంటి శిబిరంలో 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుల కేసి రాజు సీతారామయ్య, అధ్యక్షులు పప్పులు వెంకట రామారావు, బండి సూర్య ప్రకాష్ రావు, ఈడుపుగంటి నాగేశ్వరరావు, షేక్ వెంకటేశ్వర్లు, వై సత్యనారాయణ, ఆచంట జగన్నాథరావు, అకిరా కంటి ఆస్పత్రి విఆర్ఓ పి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి పడిపూజ

విశాలాంధ్ర- చాగల్లు: తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు మండలం చాగల్లులోని శ్రీ రాజ రాజేశ్వరి ఆలయ ప్రాంగణంలో బుధవారం గ్రామంలోని అయ్యప్ప మాల ధారణ ధరించిన స్వాములు 300 మంది ఆలయ అర్చకులు శివకోటి శివ సీతారాం శర్మ అధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ తేటతుళ్ళ పూజా కార్యక్రమాలను అత్యంత భక్తి శ్రద్ధలతో జరిపారు.అనంతరం గ్రామం ప్రజలు సుఖ సంతోషంతో ఆరోగ్యం గా సుభిక్షంగా ఉండాలని కోరుచూ పుర వీధులో స్వాములు గ్రామోత్సవం జరిపారు. భక్తులు స్వాములను దర్శించుకొని ఆశీస్సులు పొందారు.

హమాలీ కాలనీ ప్రజలకు రక్షణ కల్పించాలి

విశాలాంధ్ర - ఏలూరు : కొమడవోలు హమాలీ కాలనీ ప్రజలకు, మహిళలకు, ఆడపిల్లలకు రక్షణ కల్పించాలనీ, అరాచక వ్యక్తుల నుండి కాపాడాలని కోరుతూ ఐ.ఎఫ్.టి.యు.అనుబంధ హమాలీ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో కొమడవోలు హమాలీ కాలనీలో నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమంలో కాలనీ మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తమ కాలనీలో సీ.సీ కెమెరాలు ఏర్పాటు చేయాలనీ, రోడ్లు, డ్రైన్లు, కరెంటు, మంచినీటి సౌకర్యం కల్పించాలనీ, మహిళల రక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాలనీ ప్రజలకు మద్దతుగా కొమడవోలు స్థానిక ప్రజలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మంగరాజు రాము అధ్యక్షతన జరిగిన సభలో కొమడోలు మాజీ ఎంపీటీసీ వీరంకి భాస్కర రావు, ఐ.ఎఫ్.టి.యు. జిల్లా ప్రధాన కార్యదర్శి యు వెంకటేశ్వరరావు,నగర ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, కాలనీ మహిళలు పల్లి పద్మ, చల్లా సావిత్రి, చల్లా వాణి, చిప్పాడ ఆదిలక్ష్మి తదితరులు మాట్లాడారు. గత 20 సంవత్సరాల క్రితం హమాలీ కార్మికులు శ్రమతో ఏర్పాటు చేసుకున్న ఈ కాలనీలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వారు వివరించారు. తమ కాలనీలోకి కొంతమంది అరాచక వ్యక్తులు ప్రవేశించి భయభ్రాంతులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క కాలనీలోని ఇద్దరు పురుష వాలంటీర్లు ఈ కాలనీ మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని వారు తెలియజేశారు. ఆ వాలంటీర్లను కాలనీ నుంచి మరొక చోటకి బదిలీ చేయాలని డిమాండ్ చేశారు. కాలనీ ప్రజలకు ప్రభుత్వం రక్షణ కల్పించాలని కోరారు. కాలనీ ప్రజలకు మద్దతుగా కొమడవోలు స్థానిక ప్రజలు యాదగిరి చినబాబు,మిడతా నటరాజ్,యార్లగడ్డ నాగరాజు,తాతా శ్రీనివాసరావు, యార్డ్ హమ్మాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎర్రా శ్రీనివాసరావు, పల్లి గంగరాజు, సూరిబాబు, శ్రీను, రమణ, కృష్ణ, గంటా శ్రీను, రమేష్ స్థానిక కానీ ప్రజలు పల్లి శ్రీను, చల్లా బాలాజీ భారతి,మంగ,చిన్ని,చాందిని,జ్యోతి,కృష్ణవేణి తదితరులు నాయకత్వం వహించారు. ప్రభుత్వం తమ సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని తెలియజేశారు.

ఓటు హక్కుతో ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యం

విశాలాంధ్ర - పెద్దాపురం : ఓటు హక్కుతో ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యపడుతుందని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు విధిగా నమోదు చేసుకోవాలని పెద్దాపురం ఆర్డీవో జె సీతారామ రావు అన్నారు. స్థానిక మహారాణి కళాశాలలో బుధవారం తహసీల్దార్ అధ్యక్షతన ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారామారావు మాట్లాడుతూ 18 సంవత్సరాల నుండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. భారతదేశం ప్రజాస్వామ్య దేశమని, ప్రజాస్వామ్యానికి ఓటు హక్కు బలమైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అన్నారు. నమోదు ఫారం 6 ప్రకారం మీ సేవా కేంద్రాల్లో కూడా ఓటు నమోదు చేసుకోవచ్చన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులతో ఓటు హక్కు పై అవగాహన ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ పెద్దాపురం పలు పుర వీధుల గుండా నిర్వహించి ఓటు హక్కు ఆవశ్యకతపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ విజయ కుమారి, మున్సిపల్ కమిషనర్ జంపా సురేంద్ర, ఆర్ఐ వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ టి వీరయ్య చౌదరి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

విస్తృతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ

జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాకియా

విశాలాంధ్ర - పెదపూడి : ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ప్రక్రియ విస్తృతంగా జరుగుతుందని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలాకియా అన్నారు. జి మామిదాడ గ్రామంలో బుధవారం రైతు భరోసాకేంద్రాన్ని ఆమె సందర్శించి, పలు రికార్డులు పరిశీలించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఏవిధంగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఏమైనా సమస్యలు ఉన్నాయోమని పలు వివరాలు అధికారులను అడిగితెలుసుకున్నారు. ముందుగా మార్గ మధ్యలో పొలాలు వద్ద ధాన్యం రాశులను పరిశీలించారు. రైతులకు మద్దతు ధరపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఇలాకియా మాట్లాడుతూ రాష్ట్ర -ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా ధాన్యం కొనుగోలుకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతు భరోసా కేంద్రాల నుంచి రైతులు వారు పండించిన ధాన్యాన్ని విక్రయించడంతో పాటు మద్దతు ధర పొందవచ్చన్నారు. ప్రధానంగా కొనుగోలు ప్రక్రియకు సంబంధించి అవసరమైన గోనే సంచులు. రవాణా హమాలీలు మొదలగు ప్రాథమిక సౌకర్యాలు కల్పిస్తున్న నేపథ్యంలో రైతు భరోసాకేంద్రాల నుంచి ధాన్యాన్ని విక్రియంచుకోవాలని రైతులకు సూచించారు. ఏ విధంగానైన మధ్యవర్తులు దళారులను ఆశ్రయించవద్దన్నారు. ప్రతి రైతు భరోసా కేంద్రంలో రైతులకు సహాయంగా వ్యవసాయ సహాయకులు సాంకేతిక వలంటీర్లు, నియమించామన్నారు. వీరి నుంచి కనీస మద్దతు ధర పొందాలన్నారు. దాన్యం కొనుగోలుకు మండల స్థాయిలో తహసీల్దార్. ఎంపీడీఓ, వ్యవసాయశాఖాధికారితో కలిపి ఒక బృందం. ఏర్పాటు చేశారన్నారు..ఆయన వెంట కాకినాడ ఆర్డీఓ బివి రమణ, తహసీల్దార్ టి సుబాష్ ఎంపీటీసీ సుభ్యురాలు కర్రి వెంటకపద్మావతి, ఉప సర్పంచి మేడపాటి తారారెడ్డి, సిబ్బంది. పాల్గొన్నారు.

ఇంటింటికి మంచినీటినందించడమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - పెద్దాపురం : ఇంటింటికి మంచినీటినందించడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిలో భాగంగానే జలజీవన్ మిషన్ పథకం ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా తీసుకురావడం జరిగిందని ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. బుధవారం పెద్దాపురం మండలం జి రాగంపేట గ్రామంలో 46 లక్షల రూపాయలతో చేపట్టే జలజీవన్ మిషన్ ఇంటింటికి కులాయి పనులకు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తుందన్నారు. తాగునీటికీ ప్రాధాన్యతనిచ్చి గ్రామీణ ప్రాంతాల్లో జల జీవన్ పథకం ద్వారా ఇంటింటికి కుళాయి ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు .ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ తాగు నీటిని వృధా చేయకుండా ఇంటింటికి కులాయి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి గవరసాని సూరిబాబు, వైస్ ఎంపీపీ మిరియాల రాజా, ఏఎంసీ చైర్మన్ బందారు వీరబాబు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి కంటే వీర రాఘవరావు, ఎంపీటీసీ కాదా అనురాధ, ఆర్డబ్ల్యూఎస్ జెఇ అప్పలరాజు, పంచాయతీ కార్యదర్శి రమేష్ బాబు, వైసీపీ నాయకులు నరాలశెట్టి బాబ్జీరావు, నల్లల గోవిందు, బర్రె రామగోవిందు, ఎంపీటీసీ భద్రరావు, టిడిపి మండల అధ్యక్షులు కొత్తెం కోటి, టిడిపి నాయకులు బొద్దు వెంకన్న, గ్రామ వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బస్తీసంపర్క్ అభియాన్

విశాలాంధ్ర - కాకినాడ : స్థానిక రేచర్లపేట ప్రాంతంలో బుధవారం భారతీయ జనతపార్టీ అధ్వర్యంలో బస్తీ సంపర్క్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు సభల నిర్వహణలో భాగంగా జరిగిన కార్యక్రమంలో నిరుపేద మహిళలకు దుప్పట్లు పంపిణీచేశారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసిన అనంతరం కేంద్రం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్, ఎస్సీమోర్చా అధ్యక్షుడు జి. దేవానందం, కాకినాడజిల్లా దళిత అధ్యక్షుడు కొంద్రు సతీష్, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బేబీరాణి, ఎగ్జిక్యుటివ్ మెంబర్ చెరియన్, ఏడిద కృష్ణతోపాటు ముత్తా నవీన్, గట్టి సత్యనారాయణ, వై.మాలకొండయ్య, పైడా వెంకటనారాయణ, చెక్కా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మధ్యాహ్న భోజనం అందజేత

విశాలాంధ్ర - ఏలేశ్వరం : వివేకానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వా సుపత్రిలో గర్భిణీ స్త్రీలకు పౌష్టిక ఆహారంతో పాటు మధ్యాహ్న భోజనాన్ని ట్రస్ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ మైరాల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ వరుపుల రాజా ఆదేశాలతో ప్రతి నెల 9వ తేదీన ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలు ఇబ్బంది పడకుండా మధ్యాహ్నం భోజనాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నూతి బూరయ్య, వెలగల సూర్య ప్రతాపరెడ్డి, ఆసుపత్రి ఇంచార్జ్ మెడికల్ ఆఫీసర్ జి శైలజ, మండల తెలుగుదేశం నాయకులు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

విశాలాంధ్ర - కాళ్ళ : కోమటిగుంట గ్రామానికి చెందిన తూము.శ్రీనివాసరావు (34)స కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు.

నీసలి గ్రామ సమీపంలోని మేకల దిబ్బ గ్రామంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని,అతని సోదరుడు గంగ మోహన్ రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాళ్ళ ఎస్.ఐ. తెలియజేసారు.